# క్రైమ్ కౌంటర్

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం    తెలుగు పత్రిక

సంపుటి :01   సంచిక :44   ఆదివారం   09-11-2025   పేజీలు:4   వెల:2/-



క్రైమ్ కౌంటర్ NEWS
ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

**రిపోర్టర్లు కావలెను**

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్చార్జీలు
- నియోజక వర్గ ఇన్చార్జీలు

Contact No: 98497 07349


# రూ.4 లక్షల రుణం..
# రాజీవ్ యువ వికాసం స్కీమ్..







## లబ్ధిదారులకు గుడ్‌న్యూస్ ఎప్పుడు..?

నిరుద్యోగ యువత కోసం ప్రారంభించిన 'రాజీవ్ యువ వికాసం' స్వయం ఉపాధి పథకం అమలు అనిశ్చితిలో పడింది. ఈ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాల నుంచి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 42,138 మందికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు బ్యాంక్ రుణం, రాయితీ ద్వారా ఆర్థిక సాయం అందించాల్సి ఉంది. అధికారులు సిబిల్ స్కోర్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ పూర్తి చేసినా, ప్రభుత్వం నుంచి నిధుల విడుదలపై స్పష్టత లేకపోవడంతో యువత ఆశలు నిరాశగా మారాయి. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఆర్థిక స్వావలంబన సాధించడానికి.. సొంతంగా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం అమలులో తీవ్ర అనిశ్చితి నెలకొంది. లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నప్పటికీ.. నెలలు గడుస్తున్నా ఈ పథకంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రాకపోవడం వల్ల లబ్ధిదారుల ఆశల నీరుగారిపోతున్నాయి. ఈ పథకం కింద ఆర్థిక సాయం పొందడానికి జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకుంది. వరంగల్ జిల్లాలో మొత్తం 208 గ్రామ పంచాయతీల పరిధి నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన 42,138 మంది అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సంఖ్య పథకంపై యువతలో ఉన్న ఆసక్తిని తెలియజేస్తుంది. దరఖాస్తులను పరిశీలించడానికి, లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గాను, మండల స్థాయిలో ప్రత్యేకాధికారి కన్వీనర్‌గా ఎంపీడీవో, బ్యాంక్ మేనేజర్, కార్పొరేషన్ అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీలను సైతం అధికారులు ఏర్పాటు చేశారు. కమిటీలు సిబిల్ స్కోర్ వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేసి, వారి వివరాలను జిల్లా కేంద్రానికి పంపించడం కూడా జరిగింది. రాజీవ్ యువ వికాసం పథకం ముఖ్య ఉద్దేశం, బ్యాంక్ రుణంతో పాటు కార్పొరేషన్ల ద్వారా పూర్తి రాయితీని అందించడం. ఈ పథకం కింద ఎంపికైన అభ్యర్థులకు వారి అవసరాన్ని బట్టి రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు ఆర్థిక సాయం అందుతుంది. రాయితీ వివరాలు రుణ మొత్తంపై ఆధారపడి ఉంటాయి. రూ. 1 లక్ష లోపు రుణానికి 80 శాతం రాయితీ, రూ. 1 లక్ష నుంచి రూ. 2 లక్షల లోపు రుణానికి 70 శాతం రాయితీ, రూ. 4 లక్షల వరకు రుణానికి 60 శాతం వరకు రాయితీ అందిస్తారు. జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కొంతమంది లబ్ధిదారులకు ఈ సాయం అందుతుందని అంతా ఆశించారు. కానీ అది జరగలేదు. ఈ విషయంపై జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజును వివరణ కోరగా.. 'ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు, నిధుల కేటాయింపు ఉత్తర్వులు రావాల్సి ఉంది' అని ఆయన తెలిపారు. ఈ ఆలస్యం కారణంగా, యువత స్వయం ఉపాధి కలలు నిరీక్షణలో ఉండిపోయాయి. యువత ఆర్థికాభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న ఈ పథకం త్వరగా అమలు కావాలని నిరుద్యోగులు వేడుకుంటున్నారు. అయితే దీనిపై అధికారికంగా ఎలాంటి ప్రకటన రాకపోయినా.. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత వీటిపై క్లారిటీ వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

# కార్తీక మాస వన భోజనాలు ఐక్యతకు ప్రతీకలు.

కార్తీక మాస వనభోజనాలతో ఆధ్యాత్మికత, ఐక్యత ,స్నేహభావాలు.
ఈనెల 16, ఆదివారం కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజనాలు.
కార్తీక మాస వనభోజనాలను విజయవంతం చేయాలి.
కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎర్నేని వెంకటరత్నం బాబు.
ఈ నెల 16ఆదివారం దోరకుంట మామిడి తోట లో.






ఈ నెల 16ఆదివారం దోరకుంట మామిడి తోట లో.

క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్ 08 ( తోళ్ళ గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో ) కార్తీక మాస వనభోజనాలు ఆధ్యాత్మికతకు ఐక్యతకు స్నేహభావాలకు ప్రతీకలని కోదాడ కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్నేని వెంకటరత్నం బాబు అన్నారు. శనివారం కోదాడ పట్టణంలో ఈనెల 16 ఆదివారం కాకతీయ కమ్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే కార్తీక మాస వనభోజనాల కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా కమ్మ సహోదరులంతా కార్తీక మాస ఉత్సవాల్లో పాల్గొనాలన్నారు. ఎటువంటి తారతమ్యం లేకుండా నిర్వహించే ఈ వేడుకల్లో కమ్మ సహోదరులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు.దోరకుంట లోని  ఎర్నేని బాబు మామిడి తోటలో ఈనెల 16 ఆదివారం కార్తీక మాస వనభోజనాల సందర్భంగా ఉసిరి చెట్టు పూజలు వనభోజనాలతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ కమ్మ సంఘం అధ్యక్షులు ఎర్నేని వెంకటరత్నం బాబు, నలజాల శ్రీనివాసరావు, సాదినేని అప్పారావు,ఎస్ హనుమంతరావు, కర్రీ సుబ్బారావు, మందలపు శేషు, ఉప్పగళ్ల శ్రీను, భాగం కోటయ్య, ముత్తవరపు రామారావు, వేమూరీ విద్యాసాగర్, రావెళ్ళ కృష్ణారావు, ముత్తవరపు హరిబాబు, పొందూరి రమేష్, వేమూరి విద్యాసాగర్, చిట్టిబాబు, రాంబాబు,ప్రసాద్, రామ్మోహన్ రావు, తుమ్మలపల్లి భాస్కర్, లింగా జగన్మోహన్, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా వేధింపులపై మౌనంగా ఉండొద్దు.




ధైర్యంగా ఫిర్యాదు చేయండి.. నివారించండి.
మహిళ రక్షణ కై షీ టీమ్స్ కృషి చేస్తున్నాయి.
కె. నరసింహ ఐపిఎస్, ఎస్పి సూర్యాపేట జిల్లా.

# 48 గంటల సమయం ఇస్తున్నా..



గోదావరిఖనిలో రోడ్డు విస్తరణ పేరుతో 46 దారి మైసమ్మ ఆలయాలను కూల్చివేయడాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు అడ్డుగా ఉన్నాయనే కారణంతో ఆలయాలను కూల్చివేసిన అధికారులు మసీదులను ఎందుకు కూల్చలేదు? అని ప్రశ్నించారు. దీనిపై పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణశ్రీకు ఫోన్ చేసి మాట్లాడారు. రోడ్డుకు అడ్డుగా ఉన్నాయని కూల్చామని చెప్పిన అధికారులను.. అదే రోడ్డుకు అడ్డుగా ఉన్న మసీదులు ఎందుకు కూల్చలేదని ప్రశ్నించారు. ఎవరి మెప్పుకోసం మూకుమ్మడిగా మైసమ్మ ఆలయాలను కూల్చివేశారని అధికారులను నిలదీశారు. తెలంగాణ రాష్ట్రంలో గోదావరిఖనిలో రోడ్డు విస్తరణ పేరుతో జరిగిన దేవాలయాల కూల్చివేత వ్యవహారం తీవ్ర రాజకీయ దుమారాన్ని సృష్టించింది. దీనిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన హెచ్చరికలు జారీ చేశారు. హిందువుల మనోభావాలను కించపరిచేలా అధికారులు వ్యవహరించారని ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గోదావరిఖనిలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా 46 దారి మైసమ్మ ఆలయాలను కూల్చివేయడాన్ని బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. ఈ విషయమై ఆయన పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష , రామగుండం మున్సిపల్ కమిషనర్ అరుణ శ్రీలతో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డుకు అడ్డుగా ఉన్నాయనే కారణంతో ఆలయాలను కూల్చివేసిన అధికారులు, అదే రోడ్డుకు అడ్డుగా ఉన్న మసీదులను ఎందుకు కూల్చలేదు?' అని ఆయన నేరుగా ప్రశ్నించారు. ఎవరి మెప్పుకోసం ఈ మూకుమ్మడి ఆలయాల కూల్చివేతకు పాల్పడ్డారని నిలదీశారు. ఆటో డ్రైవర్లు, భక్తులు నిత్యం పూజించే మైసమ్మ ఆలయాలను ఇష్టానుసారం కూల్చివేయడం భక్తుల మనోభావాలను పట్టించుకోకపోవడమే అని ఆరోపించారు. 'హిందువులంటే అంత చులకనా?' అని ఆయన ప్రశ్నించారు. కేంద్రమంత్రి బండి సంజయ్ గోదావరిఖని యంత్రాంగానికి 48 గంటల గడువు విధించారు. కూల్చివేసిన 46 దారి మైసమ్మ ఆలయాలన్నింటినీ ఈ గడువులోగా పునర్నిర్మించాలి.. లేనిపక్షంలో, దారికి అడ్డుగా ఉన్న మసీదులన్నింటినీ కూల్చివేయాలి అని ఆయన సవాల్ విసిరారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే తాను గోదావరిఖనికి వస్తానని, దగ్గరుండి మసీదులను కూల్చివేయిస్తానన్నారు. జరగబోయే తీవ్ర పరిణామాలకు అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ అంశంపై పెద్దపల్లి జిల్లా బీజేపీ నేతలు, రాష్ట్ర నాయకులతో చర్చించి కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నట్లు ఆయన తెలియజేశారు. ఈ హెచ్చరికలు గోదావరిఖనిలో మతపరమైన ఉద్రిక్తత పెరిగేందుకు దారితీస్తున్నాయి. ఇదిలా ఉండగా.. దారి మైసమ్మ ఆలయాలను కూల్చివేసినందుకు హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. దీనిలో బీజేపీ, బీఆర్ఎస్ నేతలు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కొండపర్తి సంజీవ్, కోమళ్ల మహేష్ నాయకత్వంలో ర్యాలీగా వెళ్లి మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఆలయాలను కూల్చే ముందు బాధ్యులతో చర్చించాలన్న సుప్రీంకోర్టు సూచనను అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మహిళా వేధింపులపై మౌనంగా ఉండొద్దు.

క్రైమ్ కౌంటర్ న్యూస్ కోదాడ, నవంబర్ 08 ( తోళ్ల గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో )

మహిళలు, యువతులు ఎలాంటి సమస్యలు ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చునని, వేదింపులు ఉపెక్షించకుండా ధైర్యంగా పిర్యాదు చేయాలని, పిర్యాదులు చేసినప్పుడే పటిష్టంగా నిర్మూలించవచ్చు, మహిళల రక్షణ కోసమే షీ టీమ్స్ కృషి చేస్తున్నాయని జిల్లా ఎస్పి నరసింహ ఐపిఎస్ గారు తెలిపారు. జిల్లా లో సూర్యాపేట, కోదాడ డివిజన్ పరిదిలో షీ టీం బృందాలు పని చేస్తున్నాయని షీ టీం ఆధ్వర్యంలో వివిధ ప్రదేశాలలో, స్కూల్స్ , కాలేజీ లలో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్,పోక్సో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, ఆత్మహత్యలు, డ్రగ్స్, బాల్య వివాహాలు, వరకట్నం చట్టాలపై, నూతన మహిళా చట్టాలపై, డయల్ 100, టీ - షేప్ యాప్ మహిళ భద్రత, రక్షణ చర్యలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తునట్లు తెలిపారు. టీమ్ సభ్యులు ప్రత్యక్షంగా ఫిర్యాదులు తీసుకుంటారని, ఆన్లైన్, క్యూఆర్ కోడ్, వాట్సప్ ద్వారా కూడా స్వీకరిస్తారని తెలిపారు. మహిళలు, బాలికలపై ఆన్లైన్లో అసభ్యకర పోస్టులు పెట్టే వారు, సైబర్ నేరగాళ్లపై కూడా సైబర్, షీ టీమ్ సమన్వయంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని చెప్పారు. మహిళలు బాలికలు విద్యార్థులు షీ టీం సేవలు ఉపయోగించుకోవాలని సూచించారు. ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిస్తామని తెలిపారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన, అసభ్యకరంగా ప్రవర్తించిన, అసభ్యకరంగా మాట్లాడిన, విద్యార్థినిలు, మహిళలు అత్యవసర పరిస్థితులలో జిల్లా పోలీస్ షీ టీం నెంబర్ 8712686056 కి కాల్ చేసి, వాట్సాప్ ద్వారా సందేశం పంపించి లేదా డయల్ 100 కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని ఎస్పి సూచించారు. అక్టోబర్ - 2025 నెలలో సూర్యాపేట జిల్లా షీ టీమ్స్ కార్యకలాపాల వివరాలు: షీ టీమ్ కు అందిన మొత్తం ఫిర్యాదులు - 21 రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన కేసులు - 31,ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసినవి - 02, పెట్టీ కేసెస్ - 05 కౌన్సిలింగ్ ఇచ్చినవి - 44, సంబంధిత పోలీస్ స్టేషన్‌కి పంపినవి - 06,అక్టోబర్ - నెలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమాలు కోదాడ డివిజన్ - 21, సూర్యాపేట డివిజన్- 25.

# గర్భిణీలు ఎలాంటి ఆహారం తీసుకోవాలి



ఇంపాక్ట్ నారీ సెల్ డైరెక్టర్ వీరవెల్లి శ్రీలత

క్రైమ్ కౌంటర్ న్యూస్ నేరేడుచర్ల మండల రిపోర్టర్ పాశం లూకాస్ నవంబర్ 08 :- ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం నేరేడుచర్ల - స్త్రీ జీవితంలో అమూల్యమైనది తల్లి కావటం. అలాంటి సమయంలో శారీరకంగా, మానసికంగా గర్భిణీ స్త్రీలు ఎలా ఉండాలి తీసుకునే ఆహారంలో సరియైన పోషక విలువలు ఉండాలి. పాలు గుడ్లు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, మొలకలు, డ్రై ఫ్రూట్స్ ఇలా పోషక విలువలు ఉన్న ఆహారాన్ని తీసుకోవడం వల్ల బిడ్డ ఎదుగుదల బాగుంటుంది. అదే సమయంలో మానసికంగా కూడా చాలా దృఢంగా ఉండాలి. చిన్న చిన్న విషయాలకి ఎక్కువగా ఆలోచిస్తూ ఉంటారు. చాలా స్ట్రెస్ కి గురి అవుతూ ఉంటారు. ఇలాంటి ఆలోచనలకు దూరంగా ఉండాలి. ఫోన్, లాప్టాప్, రేడియస్ కు సంబంధించిన వాటికి దూరంగా ఉండాలి. ఎక్కువ సమయం యోగ, మెడిటేషన్ మరియు ప్రకృతికి దగ్గరగా ఉంటూ ఆరోగ్య కేంద్రంలో ఎప్పటికప్పుడు సూచనల మేరకు చెకప్ చేయించుకుంటూ, వ్యాక్సినేషన్లు వేయించుకోవాలి. డెలివరీ అయిన శిశువు పుట్టిన తర్వాత కూడా ఇలాంటి ఆహార నియమాలు పాటించడం వల్ల మాత్రమే తల్లి బిడ్డ క్షేమంగా ఉంటారని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏ ఎన్ ఎం పుష్పవతి, రేణుక ఆశ వర్కర్లు పావని, సీతమ్మ మరియు గర్భిణీ స్త్రీలు, చంటి పిల్లల తల్లులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నారాయణపురంలో ఏఐవైఎఫ్ గ్రామ కమిటీ ఎన్నిక ఏకగ్రీవం




క్రైమ్ కౌంటర్ న్యూస్ నవంబర్ 8 చిలుకూరు మండల రిపోర్టర్

సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గ చిలుకూరు మండల కేంద్రంలో కేంద్రంలోని నారాయణపురం గ్రామంలో కమిటీని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండల్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ అధ్యక్షుడిగా కీసర గాంధీ, ప్రధాన కార్యదర్శి మీసాల సాయి, ఉపాధ్యక్షులు పగిడిమర్రి అఖిల్, కాంతి కుమార్, ఫణిందర్, సహాయ కార్యదర్శి సిసింద్రీ, ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండలు, సిపిఐ మండల కార్యదర్శి మండల సిపిఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, నాయకత్వం లో వారి సహకారంతో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

# వీడు ఆటోడ్రైవరా ఇంకేమైనానా..



10 మంది అమ్మాయిలపై దారుణంగా..

వికారాబాద్ జిల్లాలోని మోమిన్ పేట్ లో మైనర్ బాలికపై జరిగిన అత్యాచారం ఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. వాహీద్ అనే ఆటో డ్రైవర్ ఈ దారుణానికి పాల్పడ్డాడు. పోలీసుల దర్యాప్తులో నిందితుడు సైకోలా మారి, ఇప్పటికే పది మంది అమ్మాయిలపై అత్యాచారం చేసి, ఆ చర్యలను తన సెల్ ఫోన్‌లో వీడియోలు తీసినట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మోమిన్ పేట్ పోలీసులువాహీద్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోక్సో వంటి కఠిన చట్టాలు ఉన్నా ఇలాంటి నేరాలు జరగడం మహిళా భద్రత పై ప్రశ్నలు రేకెత్తిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లాలోని మోమిన్ పేట్ ప్రాంతంలో ఒక మైనర్ బాలికపై జరిగిన అత్యాచార ఘటన స్థానికంగా దారుణమైన ఉద్రిక్తతను సృష్టించింది. ఒక ఆటో డ్రైవర్ తన పైశాచిక చర్యలతో సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేశాడు. కఠిన చట్టాలు, రక్షణ వ్యవస్థలు ఎన్ని ఉన్నా.. ఇలాంటి నేరప్రవృత్తి గల వ్యక్తుల కారణంగా మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. మోమిన్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసించే ఆ మైనర్ బాలికపై వాహీద్ అనే ఆటో డ్రైవర్ ఈ దారుణానికి ఒడిగట్టాడు. అతని చర్యలు ఒక సైకో వలె ఉన్నాయని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆటో డ్రైవర్ వహీద్ ఆ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు జరిపిన ప్రాథమిక దర్యాప్తులో భయంకరమైన వాస్తవాలు వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. నిందితుడు వహీద్ గతంలో కూడా సుమారు పది మంది అమ్మాయిలపై అత్యాచారాలు చేసి.. ఆ దారుణాలన్నింటినీ తన సెల్ ఫోన్‌లో వీడియోలు చిత్రీకరించినట్లుగా తెలుస్తోంది. ఇది అతనిలోని నేర ప్రవృత్తి, వికృతానందాన్ని తెలియజేస్తోంది. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మోమిన్ పేట్ పోలీసులు వెంటనే కేసు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతని సెల్ ఫోన్‌ను కీలక సాక్ష్యంగా పరిగణించి.. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు పంపారు. భారతదేశంలో బాలికలు, మహిళల రక్షణ కోసం పోక్సో చట్టం తో సహా అనేక కఠినమైన శిక్షలు విధించే చట్టాలు ఉన్నాయి. అయినప్పటికీ.. ఇలాంటి నేరాలు తరచుగా జరుగుతూనే ఉండటం సమాజంలోని లోపాలను సూచిస్తోంది. మైనర్ బాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టేందుకు ఉన్న పోక్సో చట్టాన్ని మరింత పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు బాలికలకు 'మంచి స్పర్శ, చెడు స్పర్శ' గురించి.. అలాగే సైబర్ భద్రత గురించి ఎక్కువగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పోలీసులు ఇటువంటి నిందితులపై కఠిన సెక్షన్లతో కేసు నమోదు చేసి.. దర్యాప్తును వేగవంతం చేయడం ద్వారా త్వరగా శిక్ష పడేలా చేయాలి. ఇలాంటి నేరాలకు సత్వర న్యాయం జరిగితేనే సమాజంలో భయం, నివారణ సాధ్యమవుతుంది. ఈ సంఘటన మహిళా భద్రతపై ప్రభుత్వాలు, పోలీసు యంత్రాంగం, తల్లిదండ్రులు మరింత శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని చెబుతోంది.

# ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు.




క్రైమ్ కౌంటర్ న్యూస్ మోతే, సిరికొండ,నవంబర్ 08( తోళ్ళ గురునాథం సూర్యాపేట జిల్లా బ్యూరో)సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గం మోతే మండలం సిరికొండ, రాఘవపురం ఎక్స్ రోడ్లో ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు జరిగించినారు. సంక్షేమ సారధి, సంతోషాల వారధి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి జన్మదినం సదర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొని సిరికొండ - రఘవపురం ఎక్స్ రోడ్డు గ్రామాలలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన మోతె మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కీసర సంతోష్ రెడ్డి, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ముదిరెడ్డి మదుసుధన్ రెడ్డి . ఈ కార్యక్రమం లో గ్రామల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# హార్దిక జన్మదిన శు భాకాంక్షలు !



రాజకీయాల్లో తొలి అడుగులోనే స్వతంత్ర అభ్యర్థిగా

పోటీ చేసి జడ్పీటీసీగా అనూహ్య విజయం సాధించారు. ఆ తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ ఇండిపెండెంట్ గా గెలిచి సంచలనం సృష్టించారు. మొదట టీడీపీలో, ఆ తర్వాత కాంగ్రెస్ లో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. కాంగ్రెస్లో చేరిన తక్కువ కాలంలోనే ఆ పార్టీకి స్టేట్ చీఫ్ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయతీరాలకు చేర్చి సీఎంగా పగ్గాలు చేపట్టారు. ఎనుముల రేవంత్ రెడ్డి గారు 2023 తెలంగాణా శాసనసభ ఎన్నికలలో కొడంగల్ నియోజకవర్గం నుండి శా-సనసభ్యుడుగా ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి పేరును నిర్ణయం చేసినట్లు ఢిల్లీలో 2023 డిసెంబరు 5న ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నేషనల్ జనరల్ సెక్రటరీ కేసీ. వేణుగోపాల్ ప్రకటించారు. హైదరాబాద్ ఎల్.బి.స్టేడియంలో డిసెంబర్ 7న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఎనుముల రేవంత్ రెడ్డి గారు 1969 నవంబర్ 8న పుట్టారు. ఆయన సొంతూరు నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి. తల్లిదండ్రులు నర్సింహారెడ్డి, రామచంద్రమ్మ. రేవంత్ కు ఆరుగురు అన్నదమ్ములు, ఒక అక్క ఉన్నారు. వీరిలో రేవంత్ ఐదోవాడు. సొంతూరులోనే ప్రాథమిక విద్య పూర్తి చేసిన రేవంత్.. వెల్దండ మండలంలోని తాండ్రలో ఆరో తరగతి, వనపర్తిలో హైస్కూల్, ఇంటర్ పూర్తి చేశారు. ఆ తర్వాత హైదరాబాద్ లో జేఎన్టీయూలో ఫైన్ ఆర్ట్స్ కంప్లీట్ చేశారు. డిగ్రీ చదువుకుంటూనే ఏబీవీపీలో పని చేశారు. అదే టైమ్ లో ఆర్ఎస్ఎస్ కు సంబంధించిన 'జాగృతి' పేపర్ లో పని చేశారు. అనంతరం కొంతకాలం ప్రింటింగ్ ప్రెస్ బిజినెస్ నడిపించారు. రేవంత్ రెడ్డికి మొత్తం ఏడుగురు సోదరులు, ఒక సోదరి ఉన్నారు. పెద్దన్న భూపల్ రెడ్డి రిటైర్డ్ ఎస్సై, రెండో అన్న కృష్ణారెడ్డి, మూడో అన్న తిరుపతి రెడ్డి కొడంగల్ కాంగ్రెస్ ఇంఛార్జ్‌గా పని చేశాడు. నాల్గొవ సోదరుడు జగదీశ్వర్ రెడ్డి యూఎస్‌లో స్థిరపడ్డాగా మరో ఇద్దరు సోదరులు కొండల్ రెడ్డి, కృష్టారెడ్డి హైదరాబాద్‌లో వ్యాపారాలు చేస్తున్నారు. మరో సోదరుడు కొండల్ రెడ్డి, రేవంత్ రెడ్డి ఇద్దరు కవల సోదరులు. రేవంత్ రెడ్డి మాజీ కేంద్ర మంత్రి జైపాల్ రెడ్డి తమ్ముడి కూతురు గీతా రెడ్డిని ప్రేమించి, పెద్దలను ఒప్పించి 1992లో వివాహం చేసుకున్నాడు. వారికీ ఒక కుమార్తె నైమిషా రెడ్డి ఉన్నారు. జడ్పీటీసీగా ప్రస్థానం ప్రారంభం. రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం జడ్పీటీసీగా మొదలైంది. ఆయన 2004లో అప్పటి టీఆర్ఎస్లో చేరారు. 2006లో మిడ్జిల్ మండల జడ్పీటీసీ టికెట్ ఆశించారు. అయితే టీఆర్ఎస్, కాంగ్రెస్ పొత్తులో భాగంగా టికెట్ దక్కలేదు. దీంతో రేవంత్ ఇండిపెండెంట్ గా బరిలోకి దిగి, ప్రతిపక్షాల మద్దతును కూడగట్టి జడ్పీటీసీగా విజయం సాధించారు. తర్వాత 2007లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసి అనూహ్య విజయం సాధించారు. అనంతరం తెలుగుదేశం పార్టీలో చేరి 2009లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుండి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి రావులపల్లి గురునాథ్ రెడ్డి పై 14694 ఓట్ల మెజారిటీతో గెలిచి తొలిసారి ఎమ్మెల్యేగా శాసనసభకు ఎన్నికయ్యారు. 2014లో రెండోసారి ఎమ్మెల్యేగా అక్కడినుంచే గెలిచారు. రేవంత్ రెడ్డి 2014 నుండి 17 వరకు టీడీఎల్పీ ఫ్లోర్ లీడర్‌గా పని చేసి 2017 అక్టోబరులో టిడిపికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరి ఆ తరువాత 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఆయన 2018 డిసెంబరులో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కొడంగల్ నుండి పోటీ చేసి ఓడిపోయారు. రేవంత్ రెడ్డి గారు 2019 మేలో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2021 జూన్ 26న తెలంగాణ పీసీసీ అధ్యక్షుడిగా నియమితుడై 2021 జూలై 7న తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ సమక్షంలో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. రేవంత్ రెడ్డి గారి సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ 2023 తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి 119 నియోజకవర్గాల్లో 64 అసెంబ్లీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులు గెలిచారు. రేవంత్‌రెడ్డి 2023లో కొడంగల్, కామారెడ్డి నియోజకవర్గాల నుంచి పోటీ చేసి కామారెడ్డిలో ఓటమిపాలై, కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే గెలిచారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శాసనసభాపక్షం రేవంత్ రెడ్డిని సిఎల్పీ నేతగా, రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేవంత్ రెడ్డి 2023 డిసెంబరు 7న తెలంగాణ రాష్ట్ర రెండవ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. కాంగ్రెస్ పార్టీలో నిలాదొక్కుకోవడం చాలా కష్టం. ఇటు సొంతపార్టీలో పాత నాయకులను అటు ప్రతిపక్షంలో బి ఆర్ ఎస్ మరియు బీజేపీ పార్టీలను సమర్థవంతంగా ఎదుర్కొంటూనే ఢిల్లీలో అధిష్టానంతో సంఖ్యతగా ఉంటూ అనేక ఆర్థిక సమస్యల్తో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని తనదైన శైలిలో నడిపిస్తున్న నిజమయిన రాజకీయ దురంధరుడు ఏనముల రేవంత్ రెడ్డి గారికి అభినందనలు!

# ఘనంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు.




తెలంగాణలో వరుస రోడ్డు ప్రమాదాలకు అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, డ్రైవింగ్ సెన్స్ లేకపోవడమే కారణం. రంగారెడ్డి జిల్లా చేవెళ్ల వద్ద జరిగిన ఘోర ప్రమాదమే దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. లారీలు, టిప్పర్ల డ్రైవర్లు సరైన శిక్షణ లేకుండానే.. దళారుల వ్యవస్థ ద్వారా 'వితౌట్ టెస్ట్' లైసెన్సులు పొందుతున్నట్లు తెలుస్తోంది. రవాణా శాఖలోని ఈ లోపాల వల్ల నాసిరకం డ్రైవర్లు రోడ్లపైకి వస్తున్నారు. మొబైల్ మాట్లాడుతూ దూసుకెళ్లే ఈ డ్రైవర్ల నిర్లక్ష్యం ప్రమాదాలకు దారితీస్తోంది. ఇకనైనా అధికారులు వీటిపై దృష్టి సారించి అర్హత ఉన్న వాహనదారులకు మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్ వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా కూడా రోడ్డు ప్రమాదాలు పెరగడానికి ప్రధాన కారణం నిబంధనలను పట్టించుకోకుండా డ్రైవింగ్ చేయడమే అని నివేదికల ద్వారా స్పష్టమవుతోంది. ముఖ్యంగా భారీ వాహనాల డ్రైవర్లలో నైపుణ్యం, శిక్షణ, బాధ్యత పూర్తిగా కొరవడడం వల్ల ప్రతిరోజూ ఎంతోమంది అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. మొన్న కర్నూలు జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదం, నిన్న చేవెళ్లలో టిప్పర్ లారీ డ్రైవర్ డ్రైవింగ్.. తాజాగా నల్గొండ జిల్లాలో జరిగిన ఇన్నోవా కారు ప్రమాదం.. ఇలా ఏ ప్రమాదం గురించి చెప్పుకున్నా అందులో డ్రైవర్ తప్పే కనిపిస్తోంది. వారికి ఎక్కువ శాతం ట్రాఫిక్ నిబంధనలపై కనీస అవగాహన లేకపోవడం, 'డ్రైవింగ్ సెన్స్'లేకుండా దూసుకెళ్లడం రహదారి భద్రతకే సవాల్ విసురుతోంది. రవాణా రంగాన్ని ఉపాధిగా ఎంచుకుని వచ్చే కొత్తతరం డ్రైవర్లలో చాలామందికి శిక్షణ, నైపుణ్యం లేకపోవడం తీవ్రమైన సమస్యగా మారుతోంది. లారీలు, టిప్పర్లు, ఆర్టీసీ, ప్రైవేట్ బస్సులు వంటి భారీ వాహనాలను నడిపే వీరు అరకొర పరిజ్ఞానంతోనే రోడ్లపైకి వచ్చి, పరిమితికి మించిన వేగంతో దూసుకెళ్తూ వాహనాలను అదుపు చేయలేక పెను ప్రమాదాలకు కారణమవుతున్నారు. రంగారెడ్డి జిల్లా, చేవెళ్ల సమీపంలోని మీర్జాగూడ వద్ద ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఈ నిర్లక్ష్యానికి ప్రత్యక్ష ఉదాహరణ. ఓవర్‌లోడ్‌తో పాటు మితిమీరిన వేగంతో వచ్చిన టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోవడం వల్లనే ఈ విషాదం జరిగింది. ఈ ప్రమాదం జరిగినప్పుడు సుమారు 19 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఒక్క ఘటనే డ్రైవర్ల నైపుణ్య లోపాన్ని, అధికారుల పర్యవేక్షణ వైఫల్యాన్ని వేలెత్తి చూపుతోంది. సాధారణంగా శిక్షణ లేని డ్రైవర్లు రోడ్లపైకి రావడానికి ప్రధాన కారణం డ్రైవింగ్ లైసెన్సులు అంగడి సరుకుల్లా లభించడం. రవాణా శాఖ ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లు , ఆర్టీఏ అనుమతితో నడిచే డ్రైవింగ్ స్కూళ్లు, ఏజెంట్ల దళారి వ్యవస్థ ఈ నాసిరకం డ్రైవర్లను ఉత్పత్తి చేయడానికి మూకుమ్మడిగా దోహదం చేస్తున్నాయి. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో లైసెన్సుల మంజూరులో 'డబ్ల్యూ' కోడ్ దందా బాహాటంగా నడుస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ 'డబ్ల్యూ' అంటే 'వితౌట్ టెస్ట్' అని అర్థం. అంటే.. డ్రైవింగ్ పరీక్షలు లేకుండానే.. ఏమాత్రం నైపుణ్యం లేని అభ్యర్థులకు కూడా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసి లైసెన్సులు ఇచ్చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం వంటి శివారు కార్యాలయాల్లో ఈ దందా ఎక్కువగా సాగుతున్నట్లు తెలుస్తోంది. టిప్పర్లు, లారీలు, డీసీఎంలు వంటి సరుకు రవాణా వాహనాలను, అలాగే ఆర్టీసీ అద్దె బస్సులు, స్కూల్ బస్సులు నడిపే చాలామంది డ్రైవర్లలో రోడ్డు నియమాలపై కనీస అవగాహన ఉండటం లేదు. ఈ డ్రైవర్లు ఒకవైపు భారీ వాహనాలను నడుపుతూనే ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ, మొబైల్ ఫోన్లలో మాట్లాడుతూ కిలోమీటర్ల కొద్దీ దూసుకుపోతున్నారు. ఓవర్‌టేక్ చేసే విషయంలో సరైన సెన్స్ పాటించకపోవడం, నిద్రలేమితో డ్రైవింగ్ చేయడం వంటివి చేస్తున్నారు. ఈ ఘోర ప్రమాదాలను అరికట్టాలంటే.. డ్రైవింగ్ లైసెన్సుల జారీ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా మార్చాలి. శిక్షణ కేంద్రాలు, టెస్ట్ ట్రాక్‌ల పర్యవేక్షణను పటిష్టం చేయాలి. ముఖ్యంగా భారీ వాహనాల డ్రైవర్లకు నిర్బంధ మానసిక, శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించాలి. అప్పుడే రోడ్లపై మృత్యు యాత్రకు తెరపడి.. ప్రజలకు భద్రత లభిస్తుంది.

# వలకు చిక్కిన పెద్ద చేప..



ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు రిజర్వాయర్‌లో మత్స్యకారుల వలలకు భారీ చేపలు చిక్కుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలు, నాగార్జున సాగర్ నుంచి జలాల సరఫరా పెరగడం వల్ల ఈ పరిణామం సంభవించింది. వారం రోజుల క్రితం మత్స్యకారుడికి 22 కిలోల బండజల్ల చేప లభించగా, తాజాగా ఎర్రగడ్డతండాకు చెందిన మరొకరికి 18 కిలోల గ్యాస్‌కట్ చేప దొరికింది. దీనిని కిలో రూ. 200 చొప్పున విక్రయించారు. ఇలాంటి భారీ చేపల లభ్యత స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి ఆర్థికంగా ఊతమిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో ఉన్న పాలేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం మత్స్యకారులకు అదృష్టం పట్టింది. ఇటీవల రిజర్వాయర్‌లో భారీ పరిమాణంలో చేపలు లభిస్తుండడంతో, స్థానిక మత్స్యకారుల జీవనోపాధికి ఇది గొప్ప ఊతంగా మారుతోంది. ఈ పరిణామం రిజర్వాయర్ పరిసర ప్రాంతాల్లో సంతోషాన్ని నింపింది. పాలేరు రిజర్వాయర్‌కు ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా, అలాగే నాగార్జున సాగర్ నుంచి జలాల సరఫరా పెరగడంతో జలాశయంలోకి కొత్త నీరు చేరింది. రిజర్వాయర్‌లో నీటిమట్టం పెరగడం వల్ల, కృష్ణానది ద్వారా పెద్ద పెద్ద చేపలు, కొత్త రకాల మత్స్య సంపద పాలేరులోకి చేరుతున్నట్లు మత్స్యకారులు, నిపుణులు భావిస్తున్నారు. సాధారణంగా, కొత్త నీరు చేరినప్పుడు చేపల సంతానోత్పత్తి కూడా పెరుగుతుంది. కేవలం వారం రోజుల వ్యవధిలోనే మత్స్యకారుల వలలకు రెండు భారీ చేపలు చిక్కాయి. మొదట, ఒక మత్స్యకారుడికి ఏకంగా 22 కిలోల బండజల్ల చేప లభించింది. తాజాగా ఎర్రగడ్డతండాకు చెందిన ఒక మత్స్యకారుడి వలలో 18 కిలోల గ్యాస్‌కట్ చేప చిక్కింది. ఈ చేపను కిలో రూ. 200 చొప్పున విక్రయించినట్లు తెలిసింది. అంటే.. ఒక్క చేపతోనే ఆ మత్స్యకారుడు రూ. 3,600 వరకు సంపాదించినట్లయింది. సాధారణంగా చిన్న చేపలు దొరికితే తక్కువ ఆదాయం వస్తుంది. కానీ.. ఇలా 20 కిలోలపైన, 15 కిలోలపైన బరువున్న చేపలు లభించడం మత్స్యకారుల కుటుంబాలకు పెద్ద ఆర్థిక బలంగా మారుతోంది. భారీ చేపలకు మార్కెట్లో మంచి ధర లభించడంతో.. ఈ వృత్తిపై ఆధారపడిన వారికి ఆదాయం మెరుగుపడి, వారి కష్టానికి తగిన ప్రతిఫలం లభిస్తోంది. స్థానికంగా ఉన్న మత్స్య సహకార సంఘాల ఆధ్వర్యంలో మత్స్యకారులు చేపల వేటను నిర్వహిస్తారు. ప్రభుత్వం కూడా చేప పిల్లలను రిజర్వాయర్‌లో విడుదల చేయడం వంటి కార్యక్రమాలను చేపడుతోంది. ఇప్పుడు భారీ చేపలు లభించడం, ప్రభుత్వ ప్రయత్నాలకు, పాలేరు జలాశయం సజీవత్వానికి సాక్ష్యంగా నిలుస్తోంది. పాలేరు రిజర్వాయర్ తెలంగాణలోని అతిపెద్ద రిజర్వాయర్‌లలో ఒకటిగా ఉంది. ఇది ఖమ్మం జిల్లాలోని మత్స్యకారులకు, నీటిపారుదల అవసరాలకు కీలకంగా ఉంది. ఈ భారీ చేపల లభ్యత ఇక్కడి చేపల మార్కెట్‌కు కూడా మరింత ప్రాధాన్యతను పెంచింది.

# తెలంగాణలో మరో ఘోర రోడ్డు ప్రమాదం..



నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి సమీపంలో జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కారు నియంత్రణ కోల్పోయి డివైడర్‌ను ఢీకొట్టి రోడ్డుపై అడ్డంగా పల్టీ కొట్టింది. ప్రమాదంతో కారు నుండి పెట్రోల్ లీకై మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. అయితే అదృష్టవశాత్తూ కారులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది సురక్షితంగా బయటపడ్డారు. కారు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో హైవేపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మంటలను ఆర్పి, రాకపోకలను సజావుగా కొనసాగించేలా చర్యలు చేపట్టారు. ఈ ఘటనతో కొంతసేపు ఆ ప్రాంతంలో తీవ్ర ఆందోళన నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లో రోడ్డు ప్రమాదాల సంఖ్య ఇటీవల ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. తెలంగాణలో నల్గొండ జిల్లాలో జరిగిన తాజా ప్రమాదంతో పాటు.. ఇటీవల వికారాబాద్, కర్నూలు జిల్లాల్లో జరిగిన ఘోర ప్రమాదాలు ప్రమాద తీవ్రతను, రహదారి భద్రత లోపాలను మరోసారి ఎత్తిచూపుతున్నాయి. వాహన డ్రైవర్ల అతివేగం, అజాగ్రత్త విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన ఆవశ్యకత స్పష్టమవుతోంది. నల్గొండ జిల్లా, చిట్యాల మండలం పరిధిలోని గుండ్రాంపల్లి జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఇన్నోవా వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీలు కొట్టింది. ప్రమాద సమయంలో వాహనంలో ఉన్న ఎనిమిది మంది ప్రయాణీకులు అప్రమత్తంగా బయటకు రావడంతో వారికి ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం ధాటికి ఇంజిన్‌లో మంటలు చెలరేగి ఇన్నోవా పూర్తిగా కాలి బూడిదైంది. దీంతో హైదరాబాద్ %-% విజయవాడ హైవేపై ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. నల్గొండ ఘటనలో ప్రయాణీకులు బయటపడినప్పటికీ.. గత కొద్ది రోజులుగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు పెను విషాదాలను మిగిల్చాయి. చేవెళ్ల వద్ద ఇటీవల టీఎస్ఆర్టీసీ బస్సును కంకర లారీ ఢీకొట్టడంతో దాదాపు 19 మంది మృతి చెందారు. కొందరికి గాయాలు అయ్యాయి. మృతుల్లో తల్లి, బిడ్డ, ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు విద్యార్థినులు ఉండటం హృదయ విదారకం. ఈ ప్రమాదంలో లారీ రాంగ్ రూట్లో ప్రయాణించడం, అతివేగం ప్రధాన కారణాలుగా గుర్తించారు. తెలంగాణ పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు వద్ద కూడా కొద్ది రోజుల క్రితం ప్రైవేట్ బస్సులో అగ్నిప్రమాదం సంభవించి 21 మంది సజీవ దహనం కావడం రహదారి భద్రతపై ప్రశ్నార్థకాన్ని లేవనెత్తింది. వరుస రోడ్డు ప్రమాదాలకు నిద్రలేమి డ్రైవింగ్, అతివేగం, ప్రమాదకరమైన ఓవర్‌టేకింగ్ , నిర్లక్ష్యం వంటి అంశాలే ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. వాహనదారులు, ప్రయాణీకులు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలి. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉంటేనే ఇలాంటి విషాదాలను నివారించడం సాధ్యమవుతుంది. రోడ్డు ప్రమాదాల్లో వాహన యజమానులను కూడా బాధ్యులను చేసే విధంగా తెలంగాణ ప్రభుత్వం నిబంధనలను మార్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. దీని వల్ల ప్రమాదాలు తగ్గే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# రాత్రికి రాత్రే కోటీశ్వరుడు అవ్వడం అంటే ఇదే..



తెలంగాణ యువకుడికి యూఏఈ లాటరీ లో అదృష్టం వరించింది. అక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న అనిల్‌కు.. తాను కొనుగోలు చేసిన 10 టికెట్లలో తల్లి పుట్టినరోజు తేదీ నంబర్‌కు ఏకంగా రూ. 240 కోట్లు తగిలాయి. సాధారణ రైతు కుటుంబానికి చెందిన అనిల్ కుమార్ రాత్రికి రాత్రే కోటీశ్వరుడిగా మారడంతో, అతని కుటుంబ సభ్యుల్లో, గ్రామస్తుల్లో సంతోషం వెల్లివిరిసింది. ఈ లాటరీకి సంబంధించిన పూర్తి వివరాలను ఇక్కడ తెలుసుకోండి. తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మం జిల్లాకు చెందిన ఒక సామాన్య కుటుంబ యువకుడికి యూఏఈ లో నిర్వహించిన లాటరీలో రూ. 240 కోట్ల భారీ మొత్తం తగలడంతో అతని కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది. ఈ సంఘటన ఖమ్మం జిల్లా వేంసూరు మండలం భీమవరం గ్రామంలో సంచలనం సృష్టించింది. లాటరీ గెలుచుకున్న యువకుడిని భీమవరం గ్రామానికి చెందిన బొల్లా అనిల్ కుమార్ గా గుర్తించారు. అనిల్ కుమార్‌ది గ్రామంలో సాధారణ రైతు కుటుంబం. అతని తండ్రి మాధవరావు, తల్లి భూలక్ష్మి దంపతులు. స్థానిక పాఠశాలల్లో ప్రాథమిక విద్యను పూర్తి చేసిన అనిల్, హైదరాబాద్‌లో ఉన్నత విద్యను అభ్యసించి ఆ తర్వాత ఉద్యోగం కోసం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు (యూఏఈ) వెళ్లారు. ప్రస్తుతం ఆయన అక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. అనిల్ కుమార్ కొంతకాలంగా యూఏఈలో నిర్వహించే పలు లాటరీల్లో పాల్గొంటున్నారు. ఇటీవల ఆయన కొనుగోలు చేసిన 10 లాటరీ టికెట్లలో.. తన తల్లి భూలక్ష్మి పుట్టినరోజు తేదీతో ఉన్న నంబర్‌కు ఏకంగా 240 కోట్ల రూపాయల బహుమతి తగిలింది. తల్లి పుట్టినరోజు తేదీని లక్కీ నంబర్‌గా ఎంచుకోవడమే ఆయనకు ఇంతటి అదృష్టాన్ని తెచ్చిపెట్టింది. యూఏఈలో లాటరీ తగలడంతో అనిల్ కుమార్ కుటుంబం రాత్రికి రాత్రే కోటీశ్వరులు అయ్యారు. ఇంత పెద్ద మొత్తం తగలడంతో అనిల్ తల్లిదండ్రులు మాధవరావు, భూలక్ష్మి దంపతులు అనందంలో మునిగిపోయారు. తన ఉద్యోగాన్ని, కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మొత్తాన్ని సరైన మార్గాల్లో వినియోగించుకుంటామని అనిల్ తెలిపినట్లు సమాచారం. తమ గ్రామానికి చెందిన యువకుడు ప్రపంచ స్థాయి లాటరీలో విజయం సాధించడంపై భీమవరం గ్రామస్తులు, బంధుమిత్రులు హర్షం వ్యక్తం చేశారు. సామాన్య కుటుంబానికి చెందిన అనిల్‌కు అదృష్టం వరించడం తమందరికీ గర్వకారణమని వారు పేర్కొన్నారు. అదృష్టం ఎవరిని ఎప్పుడు ఎలా వరిస్తుందో చెప్పలేం అనడానికి అనిల్ కుమార్ జీవితమే నిదర్శనంగా మారింది. అయితే అతడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. తాను ఈ డబ్బులను ఒక కారు కొనుక్కొని.. సెవెన్ స్టార్స్ హోటల్‌లో ఒక నెల పాటు బస చేయాలని ప్లాన్ చేశారు.

# ఎంత గొప్ప మనసో..



- ఆదిలాబాద్ గిరిజన మహిళ గొప్ప మనసు
- పేదల కోసం ఎకరం భూమి విరాళం
- ఇందిరమ్మ ఇళ్ల కోసం వినియోగించాలని విన్నపం

భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈ రోజుల్లో, ఆదిలాబాద్ జిల్లాకు చెందిన ఓ గిరిజన మహిళ గొప్ప మనసు చాటుకుంది. ఆమె తనకున్న మూడెకరాల భూమిలో పేదల కోసం ఏకంగా ఎకరం భూమి దానం చేసి గొప్ప మనసు చాటుకుంది. సొంత స్థలం లేక ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోలేకపోతున్న నిరుపేదల కోసం ఆమె చేసిన ఈ సాయం ఎంతో మందికి స్ఫూర్తిదాయకం. ఆమె దాతృత్వాన్ని అందరూ మెచ్చుకుంటున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు. చేతిలో లెక్కకు మించి డబ్బులున్నా సరే ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు.. సాయం చేసేందుకు చాలా మందికి మనసు రాదు. కానీ కొందరు ఇందుకు భిన్నంగా ఉంటారు. తమ దగ్గర ఉన్న దాంట్లోనే తోటి వారికి సాయం చేస్తుంటారు. ఇప్పుడు మనం చెప్పుకోబోయే మహిళ కూడా ఈ కోవకు చెందిన వ్యక్తే. ఆమెకు ఏం పదుల ఎకరాల్లో భూములు లేవు. ఉన్నదే మూడెకరాల భూమి. అందులోనే పేద వారి కోసం ఎకరం భూమి దానం చేసి తన మంచి మనసు చాటుకుంది ఓగిరిజన మహిళ. ఆ స్థలంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇవ్వాలిన కోరింది. ఆ వివరాలు. భూముల ధరలు ఆకాశాన్ని తాకుతున్న వేళ.. ఇంచు భూమిని కూడా వదులుకోవడానికి ఎవ్వరు ఇష్టపడటం లేదు. పైగా అన్యాయంగా భూములను కబ్జా చేసేవారు పెరుగుతున్నారు. ఇక తోబుట్టువుల మధ్య కూడా భూముల కోసమే గొడవలు ఎక్కువగా జరుగుతుంటాయి. అలాంటిది ఈ మహిళ మాత్రం తనకున్న మూడెకరాల భూమిలోనే పేదల కోసం ఎకరం భూమి దానం చేసి మంచి మనసు చాటుకుంది. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా సాత్నాల మండలంలోని దుబ్బగూడ గ్రామంలో వెలుగు చూసింది. ఆత్రం లేతు బాయ్ అనే మహిళ ఇంత మంచి నిర్ణయం తీసుకుంది. గ్రామంలో చాలా మంది పేద వారు ఉన్నారు. వీరిలో పది మందికి ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయి. అయితే వారికి సొంతింటి జాగా లేదు. దీంతో ఇంటి నిర్మాణం ప్రారంభం కాలేదు. అధికారులు ఇళ్లను రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నారు. పాపం ఏం చేయాలో వారికి అర్థం కాలేదు. వీరి పరిస్థితిని గమనించిన లేతు బాయ్ వారికి సాయం చేయాలని భావించింది. ఇందుకోసం తనకున్న మూడెకరాల భూమిలో పేదల కోసం గ్రామ శివారులో ఉన్న ఎకరం భూమి దానం చేయాలని నిర్ణయించుకుంది. సర్వే నంబరు 18/2/10 లోని మూడెకరాల్లో ఎకరం భూమిని దానం చేస్తూ పత్రాలను తహసీల్దార్ జాదవ్ రామారావుకు శుక్రవారం అందించారు. ప్రస్తుతం ఈ స్థలంలో 10 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ సందర్భంగా లేతుబాయ్ మాట్లాడుతూ 'వీరందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. కానీ సొంత స్థలం లేక ఇంటి నిర్మాణం వాయిదా పడింది. వారికి ఏదైనా సాయం చేయాలని భావించాను. అందుకే నాకున్న మూడెకరాల స్థలంలో వారికి ఎకరం దానం ఇవ్వాలని నిర్ణయించుకున్నాను. వారందరు ఇళ్లు నిర్మించుకుంటే చాలు' అన్నారు. తమ కోసం ఇంత సాయం చేసిన లేతు బాయ్‌ను గ్రామస్తులతో పాటు కలెక్టర్ రాజర్షి షా కూడా ప్రత్యేకంగా అభినందించారు.

# 'నా కొడుకు మరణంపై అనుమానాలున్నాయి'

జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత మాగంటి గోపీనాథ్ గుండెపోటుతో మరణించిన విషయం తెలిసిందే. అతడి మరణంపై తల్లి మహానంద కుమారి చేసిన ఆరోపణలు వివాదానికి కేంద్రంగా మారాయి. ఆసుపత్రిలో తన కుమారుడిని చూడనివ్వలేదని, కేటీఆర్ వచ్చిన తర్వాతే మరణాన్ని ప్రకటించారని ఆమె అన్నారు. వైద్యుల నిర్లక్ష్యం, భద్రతా లోపాలపై కూడా ఆరోపించారు. ఈ నేపథ్యంలో బీజేపీ నేత బండి సంజయ్ పూర్తి విచారణను డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఫిర్యాదు చేస్తే విచారణకు సిద్ధమని చెప్పారు. జూబ్లీహిల్స్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు అయిన మాగంటి గోపీనాథ్ గుండెపోటుతో మరణించినప్పటికీ.. ఈ మరణం చుట్టూ అనేక అనుమానాలు వ్యక్తవ-ువుతున్నాయి. ముఖ్యంగా గోపీనాథ్ తల్లి మహానంద కుమారి చేసిన ఆరోపణలు ఈ వివాదాన్ని మరింత పెంచాయి. మహానంద కుమారి తన కొడుకు మరణం చుట్టూ ఉన్న అనుమానాస్పద పరిస్థితులపై పూర్తి స్థాయిలో విచారణ జరపాలని కోరుతూ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. తన కొడుకు మరణాన్ని 'మిస్టరీ'గా మార్చారని ఆమె ఆరోపించారు. తన కొడుకు ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉన్నప్పుడు.. చివరికి జూన్ 8, 2025న అతడు అధికారికంగా చనిపోయినట్లు ప్రకటించిన తర్వాత కూడా అతన్ని చూడడానికి అనుమతించలేదని ఆ ఫిర్యాదులో పేర్కొంది. ఆసుపత్రి భద్రతా సిబ్బంది సునీత కుమార్తె దిశీరా లిఖితపూర్వకంగా ఇచ్చిన ఆదేశాల ప్రకారమే తనను బయటే ఉంచారన్నారు. కానీ..కేటీఆర్ మాత్రం గోపీనాథ్‌ను స్వేచ్ఛగా కలవడానికి అనుమతించారు. ఈ వివక్ష ఏదో కుట్ర లేదా మోసంజరుగుతోందనే తన అనుమానాలను మరింత పెంచిందన్నారు. అంతే కాకుండా.. కేటీఆర్ వచ్చి వెళ్లే వరకు మరణాన్ని ప్రకటించలేదని ఆరోపించారు.అంతే కాకుండా.. కిడ్నీ తొలగించిన తర్వాత వైద్యులు సరిగా పట్టించుకోలేదని.. డయాలసిస్ చేయడంలో ఆలస్యం జరిగిందన్నారు. గోపీనాథ్‌కు నియమించిన గన్‌మెన్‌లు, భద్రతా సిబ్బంది తమ విధులను సరిగా నిర్వర్తించలేదన్నారు. ఈ సిబ్బందికి సీపీఆర్ తో సహా అత్యవసర సహాయం అందించేలా శిక్షణ ఉంటుంది. కానీ, గోపీనాథ్ కుప్పకూలినప్పుడు వారు అక్కడ లేరు లేదా సరిగా స్పందించలేదని ఆమె ఆరోపించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి. రామారావు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అయిన మాగంటి సునీత తన కొడుకు మరణం వెనుక ఉన్న నిజం దాస్తున్నారని ఆమె తీవ్రంగా ఆరోపించారు.ఈ ఆరోపణలను ఆధారం చేసుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గోపీనాథ్ మరణంపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని.. ఆయన కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది నుంచి వాంగ్మూలాలను నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఆస్తి వ్యవహారాలకు ముడిపడి ఉందని కూడా ఆయన ఆరోపించారు. ఈ వివాదంపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఎవరైనా అధికారికంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఏ తల్లి కూడా తన కొడుకు మరణంపై వివాదం చేయదని, ఫిర్యాదు చేస్తే పోలీసులు తప్పక విచారణ చేస్తారని తెలిపారు.

# 'కె ర్యాంప్' స్ట్రీమింగ్ డేట్ లాక్!




ఓటీటీలోకి బుర్రపాడు ఎంటర్‌టైనర్..

దీపావళి సందర్భంగా విడుదలైన కిరణ్ అబ్బవరం నటించిన 'కె ర్యాంప్' థియేటర్లలో మంచి విజయాన్ని సాధించిన తర్వాత ఇప్పుడు ఓటిటీలోకి రానుంది. యుక్తి తరేజా హీరోయిన్‌గా, జైన్స్ నాని దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మాస్, కామెడీ, భావోద్వేగాల మేళవింపుతో ప్రేక్షకులను ఆకట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా మంచి కలెక్షన్లు సాధించిన ఈ చిత్రం మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ దాటి లాభాల్లోకి ఎంటర్ అయ్యింది. థియేటర్లలో హిట్ టాక్ నమోదు చేసుకున్న 'కె ర్యాంప్' నవంబర్ 15 నుంచి ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది. యంగ్ హీరో కిరణ్ అబ్బవరం యూత్ కనెక్ట్ ఉన్న కథలతో, మాస్. ఫ్యామిలీ ప్రేక్షకులకు చేరువయ్యే పాత్రలతో ముందుకు సాగిపోతున్నాడు. 'రాజావారు రాణిగారు'తో హీరోగా ఎంట్రీ ఇచ్చిన ఆయన 'ఎస్ఆర్ కళ్యాణ మండపం' 'సమ్మతమే', 'వినరో భాగ్యము విష్ణుకదా, 'క' వంటి చిత్రాలతో తన రేంజ్ పెంచుకున్నాడు. తాజాగా ' కె ర్యాంప్ ' మూవీతో థియేటర్లలోకి వచ్చిన ఇతర సినిమాలతో పోటీపడి దీపావళి విన్నర్‌గా నిలిచాడు. యుక్తి తరేజా హీరోయిన్‌గా జైన్స్ నాని దర్శకత్వంలో హాస్య మూవీస్ మరియు రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్లపై రాజేష్ దండ మరియు శివ బొమ్మకు సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ డేనే హిట్టు టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద దూసుకుపోయింది. దీపావళి కానుకగా అక్టోబర్ 18న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఫస్ట్ షో నుంచే సినిమా మీద పాజిటివ్ టాక్ రావడం మేకర్స్ ఊపిరి పీల్చుకున్నారు. కిరణ్ అబ్బవరం ఎనర్జిటిక్ యాక్టింగ్, కామెడీ టైమింగ్, యుక్తి తరేజాతోని కెమిస్ట్రీ ఇవన్నీ ప్రేక్షకులను భలేగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా యూత్‌కి, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి నచ్చేలా కథ సాగే తీరు అందర్నీ ఆకట్టుకుంది. అయితే సినిమాలో నరేష్ పాత్రకు సంబంధించిన కొన్ని డైలాగులు అసభ్యంగా ఉన్నాయంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. అయినప్పటికీ సినిమా మొత్తం ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజ్‌గా నిలిచింది అనే మాట మాత్రం స్పష్టంగా తెలుస్తోంది. విడుదలైన మొదటి రోజే రూ. 4 కోట్ల గ్రాస్, రూ.2.15 కోట్ల నెట్ వసూలు చేసిన 'కె ర్యాంప్' బాక్సాఫీస్‌ని షేక్ చేసింది. ఓవర్సీస్‌లోనూ జోరు చూపించింది. అక్కడ ఫస్ట్ డేనే బ్రేక్ ఈవెన్ దాటి లాభాల్లోకి అడుగుపెట్టింది. మొత్తంగా మూడు రోజులకు గాను రూ.17.5 కోట్లతో బ్రేక్ ఈవెన్ పూర్తిచేసుకుని నిర్మాతలకి, బయ్యర్లకు లాభాల పంట అందించింది. థియేటర్లలో మంచి సక్సెస్‌ను అందుకున్న ఈ చిత్రం ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను కూడా అలరించేందుకు సిద్ధమవుతోంది. నవంబర్ 15 నుండి ఈ సినిమా ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. థియేటర్లలో చూసిన వారు మరోసారి, థియేటర్లకు వెళ్లలేకపోయిన వారు మొదటిసారి సినిమా ఆస్వాదించే అవకాశం ఇది. మాస్ ం కామెడీ ం ఎమోషన్‌ల మేళవింపుతో తెరకెక్కిన 'కె ర్యాంప్' కిరణ్ అబ్బవరం కెరీర్‌కు ఊపు తెచ్చిన చిత్రంగా నిలిచింది. ఇప్పుడు ఓటీటీలో కూడా అదే జోరు కొనసాగుతుందో చూడాలి.

# మన మౌనం చేతకానితనంగా మారకూడదు..



సినిమా ప్రమోషన్ సమయంలో ఓ రిపోర్టర్ తన బరువు గురించి అడిగిన ప్రశ్నపై గౌరీ కిషన్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'అదర్స్' సినిమా ప్రమోషన్ సందర్భంగా జరిగిన ఈ ఘటనపై ఆమె ఒక అధికారిక స్టేట్‌మెంట్ రిలీజ్ చేసింది. శారీరక ఆకృతిపై వ్యాఖ్యలు చేయడం లేదా ప్రశ్నించడం బాడీ షేమింగ్ కిందకే వస్తుందని, నటీనటులను సినిమాల గురించి అడగాల్సిందని ఆమె తెలిపారు. ఇలాంటి సందర్భాల్లో మౌనం కాకుండా, తప్పు అని చెప్పే ధైర్యం చూపాలని గౌరీ సూచించారు. మలయాళం, తమిళం, తెలుగు సినిమాల్లో తన సహజమైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న గౌరీ కిషన్ ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. తమిళ చిత్రం '96' దాని తెలుగు రీమేక్ 'జాను'లో బాలనటిగా నటించి ప్రేక్షకుల హృదయాల్లో చోటు సంపాదించిన గౌరీ, తరువాత మాస్టర్, కర్ణన్, అడియే వంటి పలు చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. తాజాగా ఆమె నటించిన 'అదర్స్' సినిమా ప్రమోషన్లలో బిజీగా ఉన్న సమయంలోనే ఆమెకు ఊహించని పరిస్థితి ఎదురైంది. ప్రమోషన్ ప్రెస్ మీట్ సమయంలో ఒక రిపోర్టర్ ఆమెని "మీ బరువు ఎంత?" అని అడగడంతో గౌరీ తీవ్ర ఆగ్రహానికి గురైంది. "నా బరువు తెలుసుకుని నువ్వు ఏం చేస్తావ్?.. నేను సినిమా చేసాను, దాని గురించి అడుగు. ఇలాంటి ప్రశ్నలు బాడీ షేమింగ్ అని తెలియదా.. నువ్వు అసలు జర్నలిస్టువేనా.. అని ఆమె ఇచ్చిన సమాధానం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వివాదంపై ఇండస్ట్రీలోని పలు నటీనటులు, అభిమానులు గౌరీకి మద్దతుగా నిలిచారు. ముఖ్యంగా మహిళా నటులపైనే ఇలాంటి ప్రశ్నలు ఎందుకు ఎక్కువగా వస్తాయనే చర్చ కూడా జరుగుతోంది. ఈ నేపథ్యంలో గౌరీ కిషన్ ఒక అధికారిక నోట్ విడుదల చేశారు. తన నోట్‌లో గౌరీ ఆ ఘటన గురించి మాట్లాడుతూ... ఇది కేవలం తనకు మాత్రమే కాదు, చాలామంది మహిళలు ఎదుర్కొనే సమస్య అని స్పష్టం చేశారు. "ఒక పబ్లిక్ ఫిగర్‌గా ప్రశ్నలు ఎదురుకావడం సహజమే. కానీ శారీరక ఆకృతి గురించి ప్రశ్నలు అడగడం ఎటువంటి సందర్భంలోనూ సరికాదు. నేను అక్కడ నా సినిమా గురించి మాట్లాడడానికి వచ్చాను. కానీ అడిగింది మాత్రం బరువు గురించి. అదే ప్రశ్న ఒక పురుష నటుడిని అడిగేవారా?" అంటూ ప్రశ్నించారు. బాడీ షేమింగ్ అనే సమస్య కొత్తది కాదని, కానీ ఇంకా కొనసాగుతుండటం బాధాకరమని పేర్కొన్నారు. ఇలాంటి సందర్భాల్లో మహిళలు మౌనంగా ఉండకుండా మాట్లాడాలని, తమ అసౌకర్యాన్ని బయటపెట్టాలని చెప్పారు. "ఇలాంటి అనుభవం ఎదురైన ఎవరైనా ఉంటే, దాన్ని లోలోపలే దాచుకోవద్దు. మనమంతా కలిసి ఈ వ్యవస్థను మార్చాలి" అని ఆమె రాసుకొచ్చారు. అయితే ఈ ఘటనను కారణంగా చేసుకొని ఆ రిపోర్టర్ లేదా వ్యక్తిని టార్గెట్ చేయాలని తాను కోరుకోవడం లేదని... ఇది ద్వేషానికి మార్గం కాదు, ఇది అవగాహన పెంచుకోవడానికి ఒక సందర్భం... మనం పరస్పరం గౌరవం నేర్చుకోవాలి," అని అన్నారు. చివరగా, తనకు మద్దతుగా నిలిచిన చెన్నై ప్రెస్ క్లబ్, %ూవీహా% అసోసియేషన్, మీడియా మిత్రులు, ఫ్యాన్స్, సినీ పరిశ్రమ సహచరులకు ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. "ఈ సంఘటన నాకు మాత్రమే కాదు, అనుభవించిన ప్రతి ఒక్కరికి ఓ గుర్తు. మనం మౌనం వహించకూడదు" అని గౌరీ కిషన్ తన నోట్‌ను ముగించారు. గౌరీ కిషన్ ప్రస్తుతం వివిధ భాషల్లో పలు ప్రాజెక్టులతో బిజీగా ఉంది. ఈ ఘటన తర్వాత ఆమెకు సెలబ్రిటీ మద్దతు మరింత పెరగటం, ప్రేక్షకుల్లో ఆమెపై గౌరవం పెంచినట్టుగానే కనిపిస్తోంది.

# టాక్ సూపర్.. కలెక్షన్లు పూర్... 'ది గర్ల్‌ఫ్రెండ్'కి ఫస్ట్ డే షాక్



నేషనల్ క్రష్ రష్మిక మందానా నటించిన 'ది గర్ల్‌ఫ్రెండ్' నవంబర్ 7న విడుదలై ప్రేక్షకుల నుంచి పాజిటివ్ టాక్ అందుకుంది. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం, ప్రేమలో చేదు అనుభవాలు ఎదుర్కొన్న యువతీ భావోద్వేగ ప్రయాణాన్ని సున్నితంగా చూపించింది. రష్మిక నటనకు విమర్శకులు కెరీర్ బెస్ట్ అని ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే బాక్సాఫీస్ వద్ద మొదటి రోజు కలెక్షన్లు మాత్రం సాధారణంగా ఉండాయి. ఇండియాలో మొత్తం రూ.1.30 కోట్ల నెట్ మాత్రమే వసూలైంది. ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో నేషనల్ క్రష్ అనే ట్యాగ్‌కు నిజమైన న్యాయం చేస్తోన్న నటి రష్మికా మందన్న, టాలీవుడ్ లో ఛలో, గీతా గోవిందం, పుష్ప, పుష్ప 2, కుబేర... బాలీవుడ్‌లో యానిమల్, ఛావా వంటి వరుస విజయాలు ఆమె స్థాయిని ఒక్కో మెట్టు పైకి తీసుకువెళ్తూనే ఉన్నాయి. టాలీవుడ్, బాలీవుడ్ పరిశ్రమల్లో దూసుకుపోతున్న రష్మిక నటించిన తాజా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' మరోసారి ఆమె యాక్టింగ్ టాలెంట్‌ని బయట పెట్టింది. రాహుల్ రవీంద్రన్ రచన-దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం, ప్రేమలో చెదిరిపోయిన ఒక యువతి భావోద్వేగ ప్రయాణాన్ని సున్నితంగా, నిజాయితీగా చూపించింది. ఇందులో రష్మిక పాత్ర పేరు భూమాదేవి. ప్రేమలో మోసపోయి, కుటుంబంలో పరువు కోల్పోయి, స్వీయ గౌరవం విరిగి, మానసికంగా కుంగిపోయిన స్థితి నుండి ఎలా బయటపడింది? అనేదే ఈ సినిమా కథ. ఈ బాధను, నిరాశను క్రమంగా తిరిగి నిలబడే శక్తిని అద్భుతంగా చూపించే క్రమంలో రష్మి అద్భుతమైన నటన కనబరిచిందని ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. కొందరు రష్మిక కెరీర్‌లో ఇదే బెస్ట్ పెర్ఫార్మెన్స్ అని అంటున్నారు. శుక్రవారం విడుదలైన ఈ చిత్రం ఫస్ట్ షోతోనే పాజిటివ్ టాక్ తెచ్చుకుంది. చిత్రాన్ని చూసిన ప్రేక్షకులు ఈ చిత్రంపై ప్రశంసలు కురిపిస్తున్నారు. అయితే టాక్ బాగున్నా కలెక్షన్ల పరంగా 'ది గర్ల్ ఫ్రెండ్' తొలిరోజు బాగా నిరాశపరిచింది. ఇండియాలో అన్ని చోట్లా కలిపి ఈ చిత్రం కేవలం కోటి 30 లక్షల రూపాయల నెట్ మాత్రమే వసూలు చేసింది. ఈ ఏడాది రష్మిక నటించిన అన్ని చిత్రాల్లోనే ఇదే అతి తక్కువ కలెక్షన్లు. అయితే సెలవులు లేకపోవడం, ప్రమోషన్స్ తక్కువగా చేయడం, తక్కువ థియేటర్లలో రిలీజ్ చేయడం వంటి కారణాల వల్లే కలెక్షన్లు బాగా తగ్గిపోయారని ట్రేడ్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. తెలుగులో 838 స్క్రీన్లలో రిలీజ్ కాగా కేవలం 16,9 శాతం మాత్రమే ఆక్యుపెన్సీ నమోదు చేసింది. హిందీ వెర్షన్‌లో 99 స్క్రీన్లకే పరిమితం కావడం కూడా ప్రభావం చూపించింది. అయితే మౌత్ టాక్ బాగుండటంతో రాబోయే రోజుల్లో ఆక్యుపెన్సీ పెరిగి కలెక్షన్లు పుంజుకుంటాయని మేకర్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా కొన్ని ఫీల్‌గుడ్ చిత్రాలు ఫస్ట్ కలెక్షన్ల విషయంలో వెనకబడిపోయి... ఆ తర్వాత పుంజుకుని రికార్డులు కొట్టిన చరిత్ర ఉంది. 'ది గర్ల్‌ఫ్రెండ్' విషయంలోనూ ఇలాగే జరుగుతుందని రష్మిక ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు.

# నాగార్జున 'శివ' గోల్డ్ రింగ్..



తెలుగు చలనచిత్ర పరిశ్రమ గమనాన్ని మార్చిన చిత్రాలలో 'శివ' ఒకటి. 1989లో విడుదలైన ఈ చిత్రం.. ట్రెండ్ సెట్టర్ గా, కల్ట్ క్లాసిక్ గా నిలిచింది. అక్కినేని నాగార్జున హీరోగా డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ ఈ సినిమాని తెరకెక్కించారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ ఏర్పాటు చేసి 50 ఏళ్లు గడుస్తున్న సందర్భంగా, దాదాపు 36 ఏళ్ల తర్వాత శివ మూవీని 4%ఖ%లో రీ-రిలీజ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకి సంబంధించిన ఆసక్తికర విషయాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇండియన్ సినిమా స్థితి గతులను మార్చిన చిత్రాలలో 'శివ' ఒకటి. తెలుగు చలనచిత్ర పరిశ్రమ గురించి చెప్పుకోవాలంటే 'శివ'కి ముందు, 'శివ' తర్వాత అని చెబుతుంటారు. 1989లో కింగ్ అక్కినేని నాగార్జున, డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ కాంబినేషన్‌లో వచ్చిన ఈ చిత్రం.. ట్రెండ్ సెట్టర్ గా నిలిచింది. 36 సంవత్సరాల తరువాత ఈ కల్ట్ క్లాసిక్ మూవీని 4%ఖ% ఫార్మాట్‌లో రీ-రిలీజ్ చేస్తున్న సంగతి తెలిసిందే. నవంబర్ 14న గ్రాండ్ గా థియేటర్లలోకి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో సినిమాకి సంబంధించిన ఆసక్తికరమైన విషయాలు ఒక్కటొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. 'శివ' సినిమాతో రామ్ గోపాల్ వర్మ డైరెక్టర్ గా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్ లో వెంకట్ అక్కినేని, యార్లగడ్డ సురేంద్ర ఈ చిత్రాన్ని నిర్మించారు. ప్రచార చిత్రాలతోనే టాలీవుడ్ లో నూతన ఒరవడికి నాంది పలికిన ఈ సినిమా.. థియేటర్లలో విడుదలయ్యాక ఎన్నో సంచలనాలకు కేంద్ర బిందువుగా మారింది. బాక్సాఫీస్ దగ్గర బ్లాక్ బస్టర్ గా నిలిచింది. సినిమా సెన్సేషనల్ సక్సెస్ సాధించడంతో, నటీనటులు సాంకేతిక నిపుణులకు నాగార్జున స్పెషల్ గిఫ్ట్స్ ఇచ్చారు. 'శివ' టైటిల్ లోగోతో ప్రత్యేకంగా డిజైన్ చేయబడిన గోల్డ్ రింగ్స్ ని బహుమతిగా అందించారట. అయితే సినిమా వచ్చి 36 ఏళ్లు గడిచినా, ఇప్పటికీ ఓ వ్యక్తి తన చేతికి ఆ ఉంగరాన్ని పెట్టుకునే ఉన్నారు. ఆయన ఎవరో కాదు.. డైరెక్టర్ శివ నాగేశ్వరరావు. 'శివ' సినిమాకి ఆయన కో-డైరెక్టర్ గా వర్క్ చేశారు. డెబ్యూ డైరెక్టర్ అయిన రామ్ గోపాల్ వర్మకి అన్ని విషయాల్లో శివ నాగేశ్వరరావు చేదోడు వాదోడుగా నిలిచారు. స్టార్ట్, కెమెరా, యాక్షన్, కట్.. వంటి అంశాల గురించి ఆర్జీవీకి నేర్పించింది కూడా ఆయనే అని చెబుతారు. 'శివ' రీ-రిలీజ్ నేపథ్యంలో శివ నాగేశ్వరరావు పలు యూట్యూబ్ ఛానల్లకు ఇంటర్వ్యూలు ఇస్తున్నారు. సినిమా గురించి ఎవరికీ తెలియని ఇంట్రెస్టింగ్ విషయాలను షేర్ చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఆయన చేతికి 'శివ' లోగో ఉన్న గోల్డ్ రింగ్ ఉండటం అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ ఉంగరం ఎవరెవరి దగ్గర ఉందో తెలియదు కానీ.. సినిమా విడుదలైన 36 సంవత్సరాలు గడుస్తున్నా, ఇప్పటికీ దాన్ని మధుర జ్ఞాపకంగా దాచుకోవడం గ్రేట్ అని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.

Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006. Published by Katikala Vara Prasad. at Crime Counter Office, Opp Parivarthana school, Narasaraopate Road, Sattenapalle, AP. 522403. Editor. Katikala Vara Prasad.RNI APTEL/2015/62250. Ph:9849707349 email:kvp6858@gmail.com